

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024

పెద్దిరెడ్డి మార్కు పోస్టింగ్‌లు

- మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగుల నియామకాలు
- ఉంటాయా.. ఊడతాయా అన్న సందేహంలో అక్రమార్కులు



మదనపల్లె టౌన్, ఆగస్టు 1: రాజు తలిస్తే ఉద్యోగాలకు కొదవా అన్న చందంగా వైసీపీ పాలనలో మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో పెద్దిరెడ్డి మార్కు స్పష్టంగా కనిపించింది. ఎలాంటి అర్హత, అనుభవం, నైపుణ్యం లేకపోయినా కేవలం పెద్దిరెడ్డి సిఫారసు చేస్తే చాలు అదే అపాయింట్‌మెంట్ ఆర్డర్‌గా చెలామణి అయ్యాయి. ఇందులో జిల్లా సెలెక్షన్ కమిటీలోని సభ్యుడు అప్పటి చిత్తూరు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి ఆడిందే ఆటగా సాగింది. ఈ ఉద్యోగాల అక్రమ నియామకాలపై ప్రస్తుతం మదనపల్లె, పీలేరు ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టి సారించారు.

484 పోస్టులు మంజూరు

జిల్లాలోనే అతిపెద్ద ప్రభుత్వాస్పత్రిగా మదనపల్లె జిల్లా వైద్యశాలలో వైద్యసేవలందిస్తున్నారు. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన ప్రజలతో పాటు కర్ణాటక రాష్ట్రం చింతామణి, అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా ఇక్కడకు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. ఇలాంటి ఈ ఆస్పత్రి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుసంధానం కావడంతో 200 పడకల నుంచి 400 పడకల ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రిగా అప్‌గ్రేడ్ అయింది. దీని ప్రకారం ప్రతిరోజూ వెయ్యికి పైగా అవుట్‌పేషెంట్లు వస్తుండగా, 280 నుంచి 300 వరకు ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. దీంతో సర్వజన బోధనాస్పత్రితో పాటు మెడికల్ కాలేజి నిర్వహణకు అప్పటి ప్రభుత్వం జీవో నెంబర్ 132 ప్రకారం 484 పోస్టులు మంజూరు చేసింది. ఇందులో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు సీనియర్ వైద్యులు, మేల్, ఫీమేల్ నర్సులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పోస్టులు మంజూరు అయ్యాయి. ఇందులో సర్వజన బోధనాస్పత్రికి 202 పోస్టులు మంజూరు కాగా వాటిలో 75 ఉద్యోగాలను జిల్లా సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి పోను ఇంకా 127 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీవో నెంబర్ 131 ప్రకారం మెడికల్ కాలేజీకి 262 పోస్టులు మంజూరు కాగా అందులో ఫ్యాకల్టీ పోస్టులు పోను 26 మందికి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులుగా పోస్టింగ్‌లు వచ్చారు. ఈ తతంగం అంతా జరిగి మూడు నెలలు అవుతున్నా మిగిలిన ఉద్యోగాల భర్తీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయింది.

కాసులు కురిపించిన ఉద్యోగ నియామకాలు

మదనపల్లె సర్వజన బోధనాసత్రి, మెడికల్ కాలేజీలో 484 పోస్టుల భర్తీకి చిత్తూరు కలెక్టర్ సారథ్యంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. ఎటువంటి రాత పరీక్షలు లేకుండా కేవలం అభ్యర్థుల సర్టిఫికెట్లు, మెరిట్ ఆధారంగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల నియామకం చేపట్టాల్సి ఉంది. ఈ పద్ధతే వైసీపీ నాయకులకు కాసుల వర్షం కురిపించింది. జిల్లా సెలెక్షన్ కమిటీలో అప్పటి చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్ చైర్మన్‌గా, డీఎంహెచ్‌వో సభ్యుడిగా ఉన్నారు. ఈ క్రమంలో జిల్లాలో చక్రం తిప్పుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి జిల్లా సెలెక్షన్ కమిటీపై ఒత్తిడి తెచ్చారు. తాము సిఫారసు చేసిన వారికే ఉద్యోగాలు ఇవ్వాలని పట్టుబట్టారు. వాస్తవంగా ఉద్యోగుల ఎంపికను రోస్టర్ పాయింట్లు, మెరిట్‌లిస్టు, ద్వారా కౌన్సిలింగ్ చేసి ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. కానీ పెద్దిరెడ్డి చక్రం తిప్పడంతో కలెక్టర్ కూడా తలొగ్గినట్లు తెలిసింది. దీనిపై అభ్యంతరం తెలిపిన అప్పటి డీఎంహెచ్‌వో జి.ప్రకాశంను దీర్ఘకాలిక సెలవులో పంపించారు. ఆయన స్థానంలో ఆరోగ్యశ్రీ సమన్వయకర్త రాజశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో ఉద్యోగాల జాతరలో ఎక్కువగా తిరుపతి, పుంగనూరు, నియోజకవర్గాలకు చెందిన వారినే ఎంపిక చేశారు. అందులో కూడా ఎలాంటి మెరిట్ లిస్టును ప్రాతిపదికగా తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది వైసీపీ నాయకులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పేర్లు చెప్పుకుని ఉద్యోగాలు కావాల్సిన వారి వద్ద ముడుపులు తీసుకుని సిఫారసు లేఖలు ఇప్పించారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. మెరిట్ లిస్టు, రోస్టర్‌పాయింట్లను పక్కన పెట్టి పెద్దిరెడ్డి సిఫార్సు లేఖలతోనే ఉద్యోగాలిచ్చేశారు. దీంతో చాలామంది అర్హులైన వారు కంప్యూటర్ ప్రోగ్రామర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ కేటగిరీకి చెందిన ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నా, వారికి ఉద్యోగాలు రాలేదు.


మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి

ఇద్దరు ఎమ్మెల్యేలు సీరియస్

వైసీపీ పాలనలో ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి, మెడికల్ కాలేజీలో ఉద్యోగుల అక్రమ నియామకాలపై మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. ఈ మేరకు ఇప్పటి వర కు నియమించిన అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉ ద్యోగుల జాబితాలు, వారి మెరిట్‌లిస్టులు తెప్పించుకున్నారు. దీంతో పాటు మిగిలిన పోస్టుల వివరాలను కూడా తెప్పించుకున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి అర్హులను ఉద్యోగాల్లో ఉంచి, అనర్హులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఒంటెద్దు పోకడలతో వ్యవహరించిన చిత్తూరు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రాజశేఖర్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్లు తెలిసింది. ఇ దే జరిగితే అర్హులైన వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

టీడీపీ ప్రభుత్వంలోనే జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు

- జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం : మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, ఆగస్టు 1: టీడీపీ ప్రభుత్వంలోనే జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల ప్రీతమ్ రెసిడెన్సీలో ఏపీయూడబ్ల్యుజే అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలు జిల్లా కన్వీనర్ గౌనిపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు సంబంధించిన జీవో ప్రకారం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కాగృహాల నిర్మాణానికి కూడా కృషి చేస్తామన్నారు. సమాజంలో గతంలో ఉన్న ప్రభుత్వం మీడియాను కూడా శాసించిందని చెప్పారు. సమాజంలో జరిగే అక్రమాలు బయటకు రావాలంటే మీడియా పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఒకప్పుడు న్యూస్ అనే పదం ఉండేది. న్యూస్ అంటే ఎక్కడ ఏం జరిగినా నిర్భయంగా బయట పెట్టేదాన్ని న్యూస్ అన్నారు. అయితే నేడు న్యూస్ అనేది ఎక్కడా లేదని, అంతా హర్యాస్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జిల్లాలు ఏర్పడినందున ఏపీయూడబ్ల్యుజే అన్ని జిల్లాల కమిటీలతో పాటు రాష్ట్ర కమిటీ ఏర్పాటు, నియోజకవర్గాల కమిటీలు కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏపీయూడబ్ల్యుజే అన్నమయ్య జిల్లా కన్వీనర్ గౌనిపల్లె శ్రీనివాసులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు వారికి అండగా నిలుస్తూ రాష్ట్రంలో ఎక్కడ జర్నలిస్టులపై దాడులు జరిగినా పోరాటాలు చేయడంలో ఏపీయూడబ్ల్యుజే ముందుంటుందన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా నూతన ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా గౌనిపల్లె శ్రీనివాసులు (ఆంధ్రజ్యోతి), కార్యదర్శిగా వంశీధర్ (సాక్షి)తో పాటు ఎలక్ట్రానిక్ మీడియా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌కుమార్‌రాజు (ఐన్యూస్), కార్యదర్శిగా ఈశ్వరయ్య (99టీవీ)లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు నియోజకవర్గాల వారిగా కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు నేతలు వెంకటరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనాథరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, జాకీర్, గోపీ, క్రిష్ణయ్య, వంశీధర్, చందు, దేవరాజు, మోహన, రామయ్య, తిరుపాల్‌నాయక్, భువనేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి చంద్రబాబునాయుడు

- పింఛన్ల పంపిణీలో జగన్‌మోహన్‌రాజు


పింఛన్ పంపిణీ చేస్తున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 1 : పేద ప్రజల పక్షపాతి చంద్రబాబునాయుడు అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం ఒంటిమిట్టలో పింఛన్లను లబ్ధిదారులకు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం దోపిడీ చేసిందని, అభివృద్ధి అనేది ఎక్కడా కనపడకుండా చేసిన ఘనత వైసీపీది అని అన్నారు. పేద ప్రజల కళ్లల్లో ఆనందాన్ని ప్రతి ఇంటా చూస్తున్నామని, ఒకటో తేదీ ఉదయం 5 గంటలకే తలుపు తట్టి సిబ్బందితో ఉదయం 9 కల్లా 95 శాతం పూర్తి చేసిన ఘనత ఎన్డీయే కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 4 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇచ్చి సొంత ఇల్లు కట్టించే బాధ్యత తీసుకున్న ఘనత చంద్రబాబుకు దక్కుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, మావిళ్ల ఈశ్వరయ్య, మోదుగుల నరసింహులు, ఓబినేని సుబ్బమ్మ, పామూరు సుబ్రమణ్యం, రేవిళ్ల బాలమునెయ్య, శివారెడ్డి, మావిళ్ల శ్రీహరి, డాక్టర్ శివ, మాజీ సర్పంచ్ నరసింహులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మంచి ఆహారానికి ఉపయోగించుకోవాలి

- వృద్ధులకు సబ్‌కలెక్టర్ సూచన
- పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన మేఘస్వరూప్

కలికిరి, ఆగస్టు 1: సామాజిక పింఛను డబ్బును వయోవృద్ధులు, ఇతర పేదలు మంచి ఆహారం తీసుకునేందుకు ఉపయోగించుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. కొంతమంది పింఛనుదార్లకు ఆయనే స్వయంగా పంపిణీ చేశారు. పట్టణంలోని నాలుగు సచివాలయాల పరిధితో పాటు మర్రికుంటపల్లెలో ఉదయం నుంచి సబ్ కలెక్టరు పింఛన్ల పంపిణీ తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రకాల ఫైళ్లను తనిఖీ చేసి రికార్డు గదిని పరిశీలించారు. కొత్తగా సరఫరా చేసిన లాకర్లతో కూడిన బీరువాలను పరిశీలించారు. ముఖ్యమైన ఫైళ్లను లాకర్లలో భద్రపరచాలని సూచించారు. ఆ తరువాత స్థానిక బీసీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యాబోధన గురించి ఆరా తీశారు. బాలికల చదువులు, వసతి సదుపాయాల్లో సమస్యల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని, నిల్వ చేసిన కూరగాయలను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థినులతో కలిసి అక్కడే భోజనం చేశారు. గురుకుల పాఠశాల నిర్వహణ, భోజనం నాణ్యత గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ కలెక్టరు వెంట డిప్యూటీ తహసీల్దారు సయ్యద్, ఎంపీడీవో రామకృష్ణయ్య, ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఇతర అధికారులు ఉన్నారు.

పీలేరులో ఎమ్మార్పీఎస్ సంబరాలు

పీలేరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తీర్పు రావడంతో గురువారం పీలేరులోని ఎమ్మార్పీఎస్ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పీలేరులో పెద్దఎత్తున బాణాసంచా పేల్చుతూ సంబరాలు జరుపుకోవడమే కాకుండా అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీలలోని 59 కులాలకు వారి వారి జనాభా ప్రాతిపదికన బి.ఆర్.అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్లు సమానంగా అందాలన్న లక్ష్యంతో మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఏర్పాటు చేసి గత 30 ఏళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నారన్నారు. ఆయన పోరాటానికి ప్రతిఫలంగా సుప్రీంకోర్టు వర్గీకరణకు అంగీకరించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో దేశంలోని మాదిగల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నాసుబ్బయ్య, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ రాజు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాతయ్య, ఎంఎస్పీ పీలేరు ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, నాయకులు శ్రీనివాసులు, ముల్లంగి రెడ్డప్ప, వెంకటరమణ, వెంకటాచలపతి, నాగేశ్వరరావు, రమణ, హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.


పీలేరులో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులు

ఫైళ్ల దహనం కేసు సీఐడీకి

- రెండు రోజుల్లో సీఎం ఉత్తర్వులు
- ఆ దిశగా రికార్డులు సిద్ధం చేస్తున్న పోలీసులు



మదనపల్లె టౌన్, ఆగస్టు 1: రాష్ట్రంలోనే సంచలనంగా మారిన మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసును సీఎం చంద్రబాబు సీఐడీకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. వందలాది కోట్ల విలువైన భూముల కుంభకోణం బయటపడకుండా కుట్రకోణంతోనే సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం జరిగి ఉంటుందని ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తులో తేలిందని తెలుస్తోంది. ఈ క్రమంలో దీనిపై చంద్రబాబు సమక్షంలో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సమీక్ష నిర్వహించి ఈ కేసులను సీఐడీకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి కుటుంబీకులు, వారి అనుచరులు పెద్దఎత్తున 22(ఏ) జాబితాలో నిషేధం తొలగించిన భూములు కొనుగోలు చేశారని, పోలీసులు, రిజిస్ట్రేషన్ శాఖాధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా నిర్వహించిన కార్యక్రమంలో 600 మంది వరకు బాధితులు భూవివాదాలపై అర్జీలు అందజేయగా అందులో ఎక్కువ శాతం పెద్దిరెడ్డి కుటుంబీకులు, ఆయన ముఖ్య అనుచరుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి, వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యుల బాధితులే ఎక్కువ మంది బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిని బట్టి చూస్తే కొన్ని వందల కోట్ల విలువైన భూములు వైసీపీ కబంధ హస్తాల్లోకి వెళ్లినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపించడానికే సీఐడీకి ఈ కేసును రెండు రోజుల్లో అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెండు రోజులుగా మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో టైపిస్టులు, రైటర్లు ఈ కేసులకు సంబంధించి పది రోజులుగా ఎఫ్ఎస్ఎల్ అధికారుల తనిఖీలు, విద్యుత్ సేఫ్టీ అధికారుల తనిఖీలు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించినప్పుడు స్వాధీనం చేసుకున్న ఉండకూడని పత్రాలు తదితర అన్ని నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

సీఐడీ డీఎస్పీ రవిమనోహరాచారి ఆధ్వర్యంలో దర్యాప్తు..?

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో కుట్రపూరితంగా ఫైళ్ల దహనం కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించనున్న నేపథ్యంలో తిరుపతి డీఎస్పీగా పనిచేస్తూ తిరుపతి సీఐడీకి బదిలీ అయిన డీఎస్పీ రవిమనోహరాచారికి బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. గతంలో మదనపల్లె డీఎస్పీగా రవిమనోహరాచారి పనిచేయడం, ఇక్కడి ప్రాంతాలు, అక్రమార్కులపై అవగాహన ఉండటంతో ఈ కేసులో రవిమనోహరాచారి దర్యాప్తు వేగం పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే జరిగితే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజవర్గాలకు చెందిన భూదందాలు చేసిన వైసీపీ నాయకులు, అనుచరులు నిద్రలేని రాత్రులు గడిపే రోజులు దగ్గరపడనున్నాయి. డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పిన 8 కేసుల్లో అక్రమాలకు పాల్పడిన కొందరు వైసీపీ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో కలవరం మొదలైంది. ఈ కేసుల్లో మీ పేరు ఉందని, కాదు మీ పేరే ఉందని ఒకరికొకరు వైసీపీ నాయకులు నిందలు వేసుకోవడం వినిపించింది. కొందరైతే ఈ ఎనిమిది కేసుల ఎఫ్ఐఆర్‌లలో నిందితుల వివరాలు తెలుసుకోవడం కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

నిమ్మనపల్లిలో చిరుత కలకలం


చిరుత దాడిలో గాయపడిన దూడ

నిమ్మనపల్లి, ఆగస్టు 1: నిమ్మనపల్లి మండలంలో చిరుతపులి కలకలం రేపిం ది. మండలంలోని ముష్టూ రు పంచాయతీ మర్రిబండ వద్ద గురువారం ఉదయం రైతు శ్రీరాములు వ్యవసాయ పొలం వద్ద ఉండగా చిరుతపులి లేగదూడపై దాడి చేసి గాయపరచి అక్కడే ఉన్న కుక్కను ఎత్తుకెళ్లింది. వెంటనే ఆయన అటవీ శాఖ గార్డు శోభ, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతు మాట్లాడుతూ తాను పొలం వద్ద పనులు చేసుకుంటుండగా చిరుతపులి లేగదూడపై దాడి చేయడంతో అక్క డే ఉన్న కుక్కలు మొరిగాయని దీంతో ఒక కుక్కను చిరుత ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గ్రామ శివారులో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. పూర్తిగా బండలు ఉండటంతో చిరుత పాదముద్రలు కనిపించలేదని తెలిపారు. గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని, చిరుత కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసు, ఫారెస్టు సిబ్బంది తెలిపారు.

విమాన గోపురానికి మరమ్మతులు

- రెండు నెలల పాటు గర్భాలయం మూసివేత
- ఒంటిమిట్టలో భక్తులకు బాలాలయ దర్శనం

ఒంటిమిట్ట, ఆగస్టు 1: ఒంటిమిట్ట కోదండరామాలయ విమాన గోపురానికి పురావస్తుశాఖ టీటీడీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టేందు కు అధికారులు అంగీకరించారు. గురువారం పురావస్తు శాఖ రాష్ట్ర అధికారి బాలక్రిష్ణారెడ్డి, టీటీడీ ఇంజనీరింగ్ ఈఈ సుమతి, డిప్యూటీ ఈవో స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు రామాలయంలో చేపట్టాల్సిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం టీటీడీ గెస్ట్‌హౌస్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేవారు. కోదండ రామాలయంలో భావితరాల అవసరాలకు ఉపయోగపడే విధంగా విమాన గోపురానికి మరమ్మతులు చేపట్టాలని, అలాగే గర్భాలయంలో నల్లరాతి బండలను తొలగించి ఆలయాన్ని సుందరీకరించేందుకు నిర్ణయించామన్నారు.

రెండు నెలలు గర్భాలయం మూసివేత

కోదండరామాలయంలోని మూలవిరాట్ అయి న సీతారామ లక్ష్మణుల గర్భాలయాన్ని సెప్టెంబరు 8నుంచి రెండు నెలల పాటు మూసివేస్తా మని టీటీడీ ఆగమ అర్చకులు రాజేష్‌భట్టర్ తెలిపారు. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యం లో పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం సెప్టెంబ రు 6వ తేదీ నుంచి రెండు రోజుల పాటు స్వా మివారికి బాలాలయం నిర్వహించి మూలవిరాట్‌లోని శక్తి సామర్థ్యాలను ఉత్సవ విగ్రహాల్లోకి అనువదించడం శాస్త్రీయంగా జరుగుతుందని చెప్పారు. ఆధ్యాత్మిక వారసత్వ సంపదను సంరక్షించి భావితరాలకు అందించేందుకు పురావస్తుశాఖ, టీటీడీ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఇందుకు భక్తులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈ వెంకటరత్నం, ఏఈ నందిబాబు, ఇంజనీరింగ్ ఏఈ అమర్‌నాథరెడ్డి, సూపరిండెంటెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్, అర్చకులు వీణారాఘవాచార్యులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 3 నుంచి పవిత్రోత్సవాలు

కోదండరామాలయంలో సెప్టెంబరు 3న మంగళవారం శ్రావణ అమావాస్య రోజున కోదండరామాలయంలో పవిత్రోత్సవాలను ప్రారంభించనున్నారు. నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. 4వ తేదీ బుధవారం పాడ్యమిరోజున పవిత్ర ప్రతిష్ఠ, 5న పవిత్రాల సమర్పణ, 6న మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి.


కోదండ రామాలయంలో విమాన గోపురాన్ని పరిశీలిస్తున్న పురావస్తు, టీటీడీ అధికారులు

ఆక్రమణలో... బాలగురయ్యగారి కుంట

- పశువులు నీళ్లు తాగేందుకు దాత కుంట నిర్మాణం
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణ
- రూ.కోట్ల విలువ చేసే భూమి చేతులు మారిన వైనం
- గతంలో టీడీపీ నాయకుల గగ్గోలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బి.కోడూరు, ఆగస్టు 1: పూర్వం రైతులు తూర్పు కొండకు పశువులను తోలుకెళ్లి తాగేందుకు నీరు లేక అప్పట్లో అష్టకష్టాలు పడేవారు. వీరి కష్టాలను గమనించిన బాలగురయ్య అనే రైతు తన సొంత నిధులతో పశువుల కుంటను తన సొంత నిధులతో నిర్మించారు. కుంట నిర్మాణంతో పశువుల దాహార్తి తీరేదని పెద్దలు చెబుతారు. కాలక్రమంలో కుంట సమీపంలో ఉన్న భూములకు విలువ పెరిగింది. దీంతో కొందరు కబ్జాదారులు కన్ను కుంటపై పడింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కుంట స్థలాన్ని కబ్జా చేసి.. పట్టాలు పొంది ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారు. అమ్మకాలు సాగించడంతో ముగ్గురు చేతులు మారాయి. ప్రస్తుతం పోరుమామిళ్ల పట్టణానికి చెందిన ఓ బంగారు అంగడి యజమాని కొనుగోలు చేశారు. వివరాల్లోకి వెళితే..

బి.కోడూరు మండలంలోని అమ్మవారిపేట గ్రామానికి చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాల రైతులు పశువులు, ఎద్దులు, మేకలు, గొర్రెలను తూర్పు కొండకు తోలుకుని వెళ్లి అక్కడ పచ్చిక మేపుకుని తిరిగి తాగునీటి కోసం ఇంటికి వచ్చేవారు. బద్వేలు - పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డుకు దగ్గరలో దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో కుంటను సొంత నిధులతో నిర్మించారు. అప్పటి నుండి ఆ కుంటలో కరువు కాలంలో రైతులు పశువులు నీళ్ల తాగేందుకు వాడుకుంటూ ఉండేవారు. ఆ కుంట మున్నెల్లి రెవెన్యూ గ్రామంలో 2786లో దాదాపు ఆరు ఎకరాలు కుంట ఉండేదని, ఆ కుంట మరమ్మత్తుల కోసం 1996లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండరు నిర్వహించి మరమ్మత్తులు చేసింది. అలాగే 2002లో మార్కెట్‌యార్డునిధులతో అప్పటి టీడీపీ ప్రభుత్వం మరమ్మతులు, అలాగే 2017లో నీరు చెట్టు కింద పది లక్షల రూపాయల నిధులతో మరమ్మతులు చేశారు. మొత్తం దాదాపుగా అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.20 లక్షలు కుంట నిర్మాణం కోసం ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో కొంత మంది ఆ కుంటను ఆక్రమించుకుని పట్టాలు పొందారు. ఆ తర్వాత ఇప్పటికే ముగ్గురు చేతులు మారాయి.

బద్వేలు-పోరుమామిళ్ల మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూములు ఉండడం, వాటి విలువ అమాంతంగా పెరగడంతో స్థానికేతరుల కన్ను ఆ భూములపై పడింది. దీంతో గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడి.. రాత్రికి రాత్రే కంచెలు వేసి.. చెట్లు నాటడం వంటివి చేపట్టి పొలాలను అడ్డంగా ఆక్రమించుకుని.. ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారు. గత ప్రభుత్వానికి ముందు రోడ్డుకిరువైపులా అన్నీ ప్రభుత్వ భూములుగా ఉండి, చెట్లు, చేమలుండేవి. వాటిని రాత్రికి రాత్రే యంత్రాల సహాయంతో తొలగించి.. రాత్రికి రాత్రే కంచెలు, చెట్లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

కబ్జా స్థలంలో టీడీపీ నాయకుల ఆందోళన

గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన కుంటను మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించి అప్పట్లో ఆందోళన చేపట్టి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దారును వివరణ కోరగా, పరిశీలించి కుంట ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.



ఆక్రమణకు గురైన బాలగురయ్యగారి కుంటలో చీనీచెట్లు



కుంట స్థలంలో ఆక్రమణదారుడు నిర్మించుకున్న గెస్ట్‌హౌస్



కుంటలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్‌ఫోటో)

స్టాక్ వివరాలు నమోదు చేయాలి

- రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి



బియ్యం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు (రూరల్) ఆగస్టు, 1: బియ్యం గోడౌన్‌లో ఉండే స్టాక్ పాయింట్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ నిదియా దేవి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని బియ్యం గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. గోడౌన్‌లో ఉండే స్టాక్ వివరాలను అక్కడే ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర వస్తువుల గురించి ఆరా తీశారు. ప్రతి రేషన్ దుకాణానికి సరైన సమయంలో సరుకులు చేరాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్, ఆర్ఐ రాజశేఖర్, గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, గోడరాళ్ల ట్రాక్టర్లు సీజ్



జమ్మలమడుగు, ఆగస్టు 1: జమ్మలమడుగులో రోజు రోజుకు ఇసుక, కొండరాళ్ల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు, గండికోట దారి నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. పెన్నానదిలో పగలే ఎక్స్‌కవేటర్లతో ఇసుకను నింపుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా బ్రహ్మణి స్టీల్‌ప్లాంట్‌వైపు నుంచి గోడ ఎర్రరాళ్ల (కొండ) తరలిస్తున్నారు. జమ్మలమడుగులో బుధవారం రాత్రి పోలీసులు నాలుగు ఇసుక ట్రాక్టర్లు, కొండ రాళ్లు తరలించే మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని.. స్టేషన్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



కడప (క్రైం), ఆగస్టు 1: కడప నగరంలో వేర్వేరు చోట్ల గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 4.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమ్స్ ఎస్ఐ కె.రామచంద్ర తెలిపిన మేరకు.. గురువారం తమ సిబ్బందితో చలమారెడ్డిపల్లె సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న సగిలి బాలకొండారెడ్డి ఆలియాస్ కొండారెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.10వేలు విలువ కలిగిన 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అట్లూరు మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన సగిలి బాలకొండారెడ్డి గంజాయి విక్రయించడమే తన వృత్తిగా చేసుకుని విశాఖపట్టణం వెళ్లి ఎవరికీ అనుమానం రాకుండా ట్రైన్‌లో తీసుకువచ్చి కడపలో అమ్ముతూ ఉంటాడన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఇతన్ని పట్టుకుని ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్ పర్యవేక్షణలో అతనిపై డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ అధికారులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో నిందితుడు గంజాయి విక్రయిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే.. కడప నగరం గౌస్‌నగర్ సమీపంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ నాయక్, ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. కడప మహబూబ్‌నగర్ స్ట్రీట్‌కు చెందిన అజారుద్దీన్ ఆలియాస్ అర్జున్ గంజాయి అమ్ముతుండగా అతన్ని అరెస్టు చేసి 1.75 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్ట్

రాజంపేటటౌన్, ఆగస్టు 1: రాజంపేట పట్టణానికి చెందిన ధర్మిశెట్టి చంద్రశేఖర్‌ను చెక్ బౌన్స్ కోర్టు ఆదేశాల మేరకు గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ మద్దెయ్య ఆచారి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజంపేట మండల పరిధిలోని పోలి గ్రామానికి చెందిన కిచ్చగారి రామచంద్ర అనే వ్యక్తికి 2007 సంవత్సరంలో రాజంపేట పట్టణానికి చెందిన ధర్మిశెట్టి చంద్రశేఖర్ చెక్ ద్వారా చెల్లించాల్సిన డబ్బు చెల్లించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కోర్టుకు పలుమార్లు గైర్హాజరు కావడంతో కోర్టు ధిక్కరణ కింద చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

కడప(రూరల్) ఆగష్టు 1: ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి తద్వారా ప్రమాదాలను నివారించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సంఘం భవనంలో హెల్మెట్ వాడకం, ఉపయోగాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. న్యాయవాదులు, వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పింఛన్‌తో పేదల కుటుంబాల్లో సంతోషం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 1: పెరిగిన పింఛన్‌తో పేదల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని, పండుగ వాతావరణం కనిపిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని మాసాపేట, దిగువ అబ్బవరం, కొత్తపేట, పాతరాయచోటి తదితర ప్రాంతాల్లో పేదలకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేదల కష్టాలు వింటూ టీ తాగుతూ ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలతో మమేకమవుతూ పింఛన్లను పేదలకు అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు పక్కాగృహాలు కావాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రతిఒక్కరికీ పక్కా గృహం, పింఛన్లు మంజూరు చేస్తామని, లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే వాటిని పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందచేస్తామని తెలిపారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వయంగా పేదల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి విద్యాధర్, సుగవాసి పాలకొండ్రాయుడు, దర్బార్‌బాషా, గుర్రం సుబ్బయ్యనాయుడు, ఆంజనేయులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాసాపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రైతుల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం : పుత్తా



కేసీ కెనాల్‌లో నీళ్లకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, ఆగస్టు 1 : రైతన్నల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆగస్టు మొదట్లోనే కేసీ కెనాల్ నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దేవునికడప చెరువుకు కూడా నీళ్ల చేరుతాయని.. తద్వారా కడప ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతోనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టడంతో కృష్ణా నీటిని డైవర్షన్ చేసి.. ఇలా వదులుతున్నామని అన్నారు. రైతుల పక్షపాతి అయిన ఆయన ప్రతి ఎకరాకు నీటిని అందించేందుకు తపన పడుతున్నారన్నారు. గత మూడేళ్లుగా నీళ్లిచ్చినా రైతులు పంటలను పండించుకోలేని దుస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వంలో రైతులు సకాలంలో పంటలు సాగుచేసుకునేందుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వల్లూరు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, చెన్నూరు అధ్యక్షుడు విజయభాస్కర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శివారెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదినిమ్మాయపల్లె ఉప సర్పంచ్ రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, విజయారెడ్డి, ఓబుల్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎంపీడీవో విజయభాస్కర్, రెవెన్యూ సిబ్బంది, ఆయకట్టుకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి : కలెక్టర్



కొప్పర్తిలో మొక్క నాటుతున్న కడప జిల్లా కలెక్టర్, జేసీ

సీకేదిన్నె, ఆగస్టు 1: మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి అభివృద్ధి చెందుతుందని.. జిల్లాకే తలమానికంగా ఉంటుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో నూతన పరిశ్రమలు 500 ఎకరాల్లో ఏర్పాటు అయిన మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను జేసీ అతిధిసింగ్‌తో కలిసి గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎంసీలో రెండు లక్షల చదరపు అడుగుల్లో ఏపీఐఐసీ నిర్మించిన షెడ్లలో ఆల్‌డిక్సన్ కంపెనీ, సీపీప్లస్ కంపెనీ నిర్వహణలో సీసీ కెమెరాలు, ఇతర సెక్యూరిటీ, సిస్టం ఉత్పత్తిని, నాణ్యతను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి అందుతున్న సదుపాయాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎటువంటి సదుపాయాలు కావాలన్నా తన దృష్టికి తేవాలని యాజమాన్యాలకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొప్పర్తి పారిశ్రామికవాడను రాష్ట్రంలోనే మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే కొప్పర్తిలో అనేక పరిశ్రమలు రూపుదిద్దుకుంటాయని.. జిల్లాలో యువతకు భారీగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్, జేసీలు ఆల్‌డిక్సన్ కంపెనీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ నినాదం స్ఫూర్తితో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటపతి, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఉదయ్ కుమార్, ఇండస్ట్రియల్ జీఎం జయలక్ష్మి, ఆల్‌డిక్సన్ జీఎం రాజీవ్‌శైని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అండర్-19 క్రికెట్ పోటీలు

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 1: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. మూడోరోజు గురువారం వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌ల్లో తీరిలా..

- కేఎస్ఆర్ఎం మైదానంలో క్రిష్ణా-వెస్ట్ గోదావరి జట్లమధ్య సాగింది. టాస్ నెగ్గిన వెస్ట్‌గోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 281 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రక్షణ్ 87 పరుగులు, రేవంత్ 68 పరుగులు చేశారు. క్రిష్ణా జట్టు బౌలింగ్‌లో రాజేష్, గీత్ చెరీ 5 వికెట్లు సాధించారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన క్రిష్ణా జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 16 పరుగులు చేసింది. ఇందులో ధనుష్ 8 పరుగులతో, భవాని 6 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.
- రిమ్స్ సమీపంలోని ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- నెల్లూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో 51.3 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ పూర్ణ గణేశ్ 5 వికెట్లు పడగొట్టాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. దీంతో మరో 24 పరుగుల లోటుతో నెల్లూరు జట్టు సాగుతోంది.
- నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సుశాంత్ 88 పరుగులు, కళ్యాణ్‌కుమార్ 72 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 82 పరుగులు చేసింది. ఇందులో ఈశ్వర్ (బ్యాటర్) 43 పరుగులతో, మరో బ్యాటర్ యశ్వంత్ 20 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో విశాఖ మరో 130 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.



5 చొప్పున వికెట్లు తీసిన రాజేశ్, గీత్ (క్రిష్ణా), పూర్ణగణేష్ (నెల్లూరు)

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

● భారీగా హాజరైన పాత్రికేయులు



శ్రీనివాసులు, వంశీధర్, రమేశ్‌కుమార్‌రాజు, ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, ఆగస్టు 1: ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ప్రీతమ్ రెసిడెన్సీలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రథమ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సమప్రాధాన్యం కల్పిస్తూ.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సాయంకాలం ఎడిటర్ వెంకటరెడ్డి తదితరుల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ప్రింట్‌మీడియా జిల్లా అధ్యక్షుడిగా గౌనిపల్లె శ్రీనివాసులు (ఆంధ్రజ్యోతి), ప్రధానకార్యదర్శిగా వంశీధర్ (సాక్షి), కోశాధికారిగా రామచంద్ర (విశాలాంధ్ర), గౌరవ సలహాదారులు రెడ్డెయ్యరాజు, గౌరవాధ్యక్షుడిగా జి.వి.క్రిష్ణయ్య (ఆంధ్రప్రభ)లను ఎన్నుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రమేష్‌కుమార్‌రాజు (ఐన్యూస్), ప్రధాన కార్యదర్శిగా సి.ఈశ్వరయ్య(99టీవీ), కోశాధికారిగా శ్రీధర్‌బాబు (స్వతంత్ర)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పల్లం తాతయ్య (మహాన్యూస్), గౌరవ సలహాదారులుగా కె.వెంకట్రామరాజు (10 టీవీలను) ఎన్నుకున్నారు.

ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తెస్తాం : చమర్తి

ఒంటిమిట్ట, ఆగస్టు 1: సోమశిల ఎత్తిపోతల పథకాన్ని రైతులకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండలంలో తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న రైతాంగం కోసం ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి త్వరలో సాగు, తాగునీరు అందిస్తామన్నారు. మండలంలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నదని, రైతులను ఆదుకోవాలని జగన్‌మోహన్‌రాజుకు మండలంలోని రైతులు విన్నవించారు. ఈ మేరకు ఆయన కడప కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో ఫోన్లో మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఏ మేరకు నిధులు కావాలో తనకు నివేదించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో పైపులైను ద్వారా చెరువుకు నీరు వదలకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : బీజేపీ

రాజంపేట, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ తీర్పు చారిత్రాత్మకమని, ఇది అణగారిన వర్గాల దశాబ్దాల పోరాటానికి తగిన ప్రతిఫలం లభించిందన్నారు. అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణమాదిగ ఈ తీర్పుతో చరిత్ర పుటల్లోకి ఎక్కారన్నారు. ఎస్సీ వర్గీరణకు అనకూలంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నట్లు అయిందన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, రైల్వేకోడూరు అసెంబ్లీ కోకన్వీనర్ గాజుల శ్రీనివాసులు, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాపయ్య, రమణ, రెడ్డయ్య, లక్ష్మీనారాయణ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలను బిడ్డకు దూరం చేయొద్దు

రాజంపేటటౌన్, ఆగస్టు 1: అమృతం లాంటి తల్లిపాలను బిడ్డలకు దూరం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శేఖర్ తెలిపారు. గురువారం పట్టణంలోని రాజంపేట ప్రభుత్వ ఆసుప్రతిలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్, మార్కెట్, పాతబస్టాండ్‌లలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల రోగనిరోధకశక్తి ఏర్పడుతుందని, దీనివల్ల బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని ఆయన తెలిపారు. తల్లి ప్రాముఖ్యతను తెలిపేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు వారోత్సవాలు నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. నేటి మహిళలు అపోహలతో బిడ్డలకు పాలు తాపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ లక్ష్మీప్రసన్న, వికాస్, అశోక్ చైతన్య, స్నేహలత, సీనియర్ అసిస్టెంట్ సిద్దిరామయ్య, జయప్రకాష్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయాలని వినతి

సుండుపల్లె, ఆగస్టు 1: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె, కొత్తపల్లి, బెస్తపల్లిలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. సీసీ రోడ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్‌బాబుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. వర్షం పడితే గుంతల్లో వర్షపు నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం : సీడీపీఓ

చిట్వేలి, ఆగస్టు 1: బిడ్డలకు తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టులోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు విశాలాక్షి, సురేఖరాణి, పీహెచ్ఎన్ విజయకుమారి, అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

చిట్వేలి, ఆగస్టు 1: వెంకటరాజుపల్లెలో మలిశెట్టి నరేంద్ర ఇటీవల సూళ్లూరుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఈ మేరకు విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కూటమి నేతలతో కలిసి నరేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, గుండయ్యనాయుడు, చలపతి, రామచంద్ర, మురగనిబాబు, నేతివారిపల్లె సర్పంచ్ గుండాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెకు సాగునీరు అందిస్తా

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 1: వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ప్రత్యేక కాలువ ఏర్పాటు చేసి మండలానికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదురెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యనమలవాండ్లపల్లె, అనంతపురం, ఈడిగపల్లె, వడ్డెపల్లె, జి.జి.రాచపల్లె, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తను ఆప్యాయంగా పలకరించి అన్నివిధాల ఆదుకుంటానని ఆయన కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రతి గ్రామంలోనూ మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మ వడ్డెపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రజల రుణం తీర్చుకుంటానని, వచ్చే ఐదేళ్లలో జిల్లాకు పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో కొత్తగా బోర్లు వేసి తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. అలాగే ప్రతి పల్లెకు తారోడ్లు ఏర్పాటు చేసి అవసరమైన గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే టీడీపీ లక్ష్యమని, మంత్రి నారాలోకేశ్ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అంతే కాకుండా రైతులు ఇబ్బందులు పడకుండా కొన్ని ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రెడ్డన్న, సీఐ జీవన్‌గంగనాధబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, ఏఐసీసీ జోనల్ మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల యువనాయకుడు మదనమోహన్, రామాంజనేయులు, డాక్టర్ల సంఘం పార్లమెంటు ప్రధాన కార్యదర్శి షఫీనాయక్, పక్కీరయ్య, ఆరీఫుల్లా, జయచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె: స్కౌట్స్ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించుకుని రోల్ మోడల్‌గా ఎదగాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో స్కౌట్స్ విద్యార్థులు, అధికారులతో కలిసి ప్రపంచ స్కౌట్స్ స్కార్ఫ్‌డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరి నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, గైడ్ కెప్టెన్ హేమలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సంబేపల్లె: మండలంలోని దేవపట్ల గ్రామం అసంజీవాండ్లపల్లెకు చెందిన బాబయ్య అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడి చికిత్స చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా గురువారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెళ్లి కార్యకర్తను పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీలాంటి కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, నాగేశ్వర్ నాయుడు, ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, శేఖర్‌రెడ్డి, భయ్యారెడ్డి, అలంసాబ్, నాగార్జుననాయుడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వృద్ధులకు పింఛన్ పంపిణీ చేయాలి

● రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి పింఛన్‌ను సకాలంలో వృద్ధులకు పంపిణీ చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ నిధియాదేవి తెలిపారు. గురువారం పట్టణంలో ఇంటింటి పింఛన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రతి అధికారి ఉదయం 6 గంటల నుంచే పింఛన్ కార్యక్రమంలో పాల్గొనాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్, ఆర్ఐ రాజశేఖర్, సీడీపీఓ సౌభాగ్యమ్మ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజంపేటలోని ఊటుకూరు, మేకావారిపల్లె, ఎగువ బసినాయుడుగారిపల్లె తదితర గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, ఊటుకూరు నాయకులు చెంగల్‌రాయులు, మలిశెట్టి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే కూచివారిపల్లె పంచాయతీ, రాజీవ్‌నగర్, అహ్మద్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ నిర్వహించారు. ఇక సుండుపల్లె మండలంలోని.. 13 పంచాయతీల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. సిద్దవటం మండలంలోని... బొగ్గుడివారిపల్లె, ఆకురేపల్లె గ్రామాల్లో మాజీ మంత్రి సి.రామచంద్రయ్య తనయుడు టీడీపీ యువనేత సి.విష్ణుస్వరూప్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్‌లు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, తహసీల్దారు మురాద్వావలి, మండల విస్తరణాధికారి పులిరాం సింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనురాధ, వీఆర్వో రేణుకా, పంచాయతీ సెక్రటరి సుజాత, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నందలూరులో... మాజీ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఓబులవారిపల్లెలో... పలు పంచాయతీల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది. టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. పెనగలూరులోని... 14 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. మండలవ్యాప్తంగా మండల పరిషత్ అధికారి హరిప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు. గాలివీడులో... మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సబ్ కలెక్టర్



పెన్షన్ల పంపిణీలో విష్ణుస్వరూప్, హరిప్రసాద్

లక్కిరెడ్డిపల్లెలో.. ప్రతి లబ్ధిదారుని ఇంటివద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తామని జడ్పీ సీఈఓ వెంకటరమణారెడ్డి పేర్కొనారు. గురువారం అనంతపురం ఈడిగపల్లెలో పెన్షన్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2,22,313 లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఏఓ గురుప్రసాదు, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 1: కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో సీనియర్ నాయకులు పుల్లయ్య అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా రాజకీయ కక్ష సాధింపులు మానుకోవాలని, లేదంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఏపీఎండీసీ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరామయ్య, లింగాల యానాదయ్య, ఎం.శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్, నారాయణ, లక్ష్మీకర్, ఎం.సుబ్బరాయుడు, బండారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాల ఆవశ్యకతపై వివరిస్తున్న దృశ్యం

సంబేపల్లె, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మడితాటి మధుసూదన్‌రెడ్డి తెలిఆరు. గురువారం మోటకట్ల గ్రామం వంగిమళ్ల వాండ్లపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై తెలియజేశారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాపించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉండడంతో బిడ్డ, తల్లి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అనంతరం కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సదాశివారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు



సంబరాల్లో ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో రైల్వేకోడూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు వెంబడి రాధాక్రిష్ణ, నగిపాటి చెంగయ్యల ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని, ఆది నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ఈ విజయాన్ని మాదిగ బిడ్డలకు అంకితం చేస్తున్నామని తెలిపారు. మాదిగల్లో ఉన్న 59 ఉప కులాలకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో స్వరాజ్యం వచ్చినట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పెంచలయ్య, హరిబాబు, రాజశేఖర్, శివయ్య, శివయ్య, సంతోష్ పాల్గొన్నారు.

వరి రైతులకు సలహాలు, సూచనలు



సిద్దవటం, ఆగస్టు 1: డేగలవారిపల్లె మంగళంవారిపల్లెలో గురువారం వరినాటు రైతులకు బద్వేల్ వ్యవసాయ సంచాలకుడు నాగరాజు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాచోట్ల వరినాట్లు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించకపోవడంతో వరినారు చనిపోవడం జరుగుతుందని తెలియజేశారు. రసాయనిక ఎరువులు వాడడం వల్ల సాగుచేసిన వరిపొలాలు చౌడు భూములుగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా సహాయకులు ఆకుల వంశీ, ఫణీంద్ర, రైతులు పాల్గొన్నారు.

నేడు విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం

● కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 1: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం 4:00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన జరగనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యులు హాజరు కావాల్సిందిగా ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా సాధికారిక అధికారి తెలియజేశారు.

4న సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

ఒంటిమిట్ట, ఆగస్టు 1: ఉమ్మడి కడప జిల్లాలో ఈ నెల 4 నుంచి జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్టు ఎంపిక నిర్వహించనున్నారు. ఉమ్మడి కడప జిల్లా బాలబాలికల జట్టును రాయచోటి మాసాపేట జడ్పీ పాఠశాల మైదానంలో ఈనెల 4న ఉదయం 10 గంటలకు ఎంపికలు నిర్వహించనున్నారు. ఎంపికకు అర్హతగా 01-01-2007 పైన జన్మించి ఉండాలని, ఎంపికకు పాల్గొన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికలను కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జాయింట్ సెక్రటరి జేమునాధ్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సెలక్షన్ ఆర్గనైజర్ సెక్రటరి జగదీశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, సభ్యులు గంగులయ్య తదితరులు తెలిపారు.

విద్యాకమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

ఒంటిమిట్ట, ఆగస్టు 1: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్‌కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిందని ఎంఈవో వెంకటసుబ్బయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 49 స్కూళ్లల్లో విద్యాకమిటీ ఎన్నికలు నిర్వహించనున్నామని, 1 నుంచి 5వ తేది వరకు ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ ఉంటుందని, 6 నుంచి 10 వరకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఉంటుందని ఎంఈవో తెలిపారు. తరగతికి ముగ్గురిని చొప్పున సభ్యులు ఎన్నుకున్న అనంతరం ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు.

నందలూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం ఉదయం మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, ఎంఈఓ నాగయ్యలు విడుదల చేశారు. ఈ నెల 8న జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల కోసమై ఈ ప్రకటన విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, బాలికల జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయండి



బీసీ హాస్టల్‌లో వివరాలు తెలుసుకుంటున్న రెడ్డిప్రసాద్

రైల్వేకోడూరు, ఆగస్టు 1: మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ రెడ్డిప్రసాద్ తెలిపారు. గురువారం బీసీ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన వసతులు ఏం ఉన్నాయి, ఇంకా ఏం కావాలి అనేది దాని పై సంబంధిత శాఖ అధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోళ్లు, రుబ్బురాళ్లు సరిహద్దు దాటింపు

చిన్నమండెం, ఆగస్టు 1: మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో వరుణుడి కోసం గ్రామస్తులు ముక్కలైన రాళ్లు, రుబ్బురాళ్లను వండాడి- మల్లూరు గ్రామ సరిహద్దుకు తరలించారు. వండాడి మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం గ్రామస్తులు ఐదు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను ఉపయోగించి అనాదిగా వస్తున్న సాంప్రదాయాన్ని పాటించారు. తమ గ్రామంలోని తొగట కులస్తుల దగ్గర పూజల అనంతరం మంగళ వాయిద్యాలు, డప్పులు, పలకలు, బాణాసంచాలతో గొర్లముదివేడు గ్రామ సరిహద్దు వద్ద పాడైపోయిన రాళ్లను తోలారు. ఇలా చేస్తే వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని గ్రామస్తుల నమ్మకం. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



ముక్కలైన రోళ్లను గ్రామ సరిహద్దు దాటిస్తున్న గ్రామస్తులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

● ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు

రాయచోటిటౌన్, ఆగస్టు 1: తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాల ప్రజలందరూ ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ అంశంపై గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజేయులు మాదిగ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు మొదలుకొని అలుపెరగని పోరాటం చేసి ప్రాణత్యాగాలు, బలిదానాలతో ఎన్నో సమస్యలను అధిగమించి రాజ్యాంగబద్ధంగా ఎస్సీలు విజయంలో ముందడుగు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రమణ, వీరబల్లి వెంకట్రమణ, ఉపాధ్యాయులు రోశయ్య, మాజీ సెక్రటరి రాజా, ఎంఈఎఫ్ హరిబాబు, ఝాన్సీ, దొడ్డి సురేశ్, మాతయ్య, డీలర్ రమణ, రామక్రిష్ణ, టీవీ రమణ, శంకరయ్య, మానవహక్కుల విద్యార్థి నాయకుడు సాయికుమార్, నాగార్జున, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొత్తుకూరుపల్లెలో పారిశుధ్య పనులు

రామాపురం, ఆగస్టు 1: పంచాయతీ విస్తీరణాధికారి ఉషారాణి ఆదేశాల ప్రకారం మండలంలోని పొత్తుకూరుపల్లె గ్రామాల్లో గత వారం నుంచి పారిశుధ్య పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా బండపల్లి పంచాయతీలోని పొత్తుకూరుపల్లెలో గురువారం ఆ గ్రామ సర్పంచ్ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి వీరయ్య తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు పడి మురుగునీరు, డ్రైనేజీ కాలువలు నిండిపోయి రోడ్లపైకి నీరు రావడం గ్రామంలో పారిశుధ్యం లోపించి అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఈ పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు. తమ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు వృద్ధి కాకుండా అంటు వ్యాధులు, విషజ్వరాలు భారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి గ్రస్తులను ఆదుకుందాం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 1: కుష్టువ్యాధి నిర్మూలిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. గురువారం కోనంపేట పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్టువ్యాధి నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షించి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. శరీరంపై తెల్లటి మచ్చలు ఉండి స్పర్శ లేకపోయినా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లిఎస్, టీం శంభుప్రసాదు, డాక్టర్లు సాద్దయ్య, సీహెచ్‌ఓ రవీంద్ర, సూపర్‌వైజర్లు సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ

లోకేష్ అన్నా... పేద పిల్లల ఆకలి తీర్చండి



- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 23వేల మంది విద్యార్థులకు లబ్ధి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తారనే ఆశతో పేద విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలులో ఉన్న ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే జగన్ రద్దు చేసేశారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ కాలేజీల్లో ఈ పథకం తిరిగి ప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ కూడా ఇచ్చారు.

- తిరుపతి(విద్య)

62 కళాశాలల్లో 23వేల మంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో 62 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఏటా సుమారు 23 వేలమంది విద్యార్థులు ఇంటర్ చదివేవారు. సాధారణంగా ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద,మధ్యతరగతి కుటుంబాలు, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతుంటారు. కనీసం లంచ్ బాక్స్ తెచ్చుకోలేనివారు వీరిలో చాలామంది ఉంటారు. దీనికితోడు వీరు దాదాపు 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కళాశాలలకు వస్తుంటారు. దీంతో కళాశాల సమయంకంటే గంట, లేక రెండు గంటల ముందే ఇళ్లనుంచి బయల్దేరుతారు. అల్పాహారమో, లేక చద్దన్నమో తినేసి ఇళ్లనుంచి కళాశాలలకు చేరుకునే విద్యార్థులు మళ్లీ సాయంత్రం ఇళ్లకు చేరేవరకు ఆకలితోనే చదువులు సాగిస్తారు. ఇప్పుడు నారా లోకేష్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కావడంతో అటు విద్యార్థులతోపాటు ఇటు అధ్యాపకులు సైతం ప్రభుత్వంవైపు ఆశగా చూస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

పేద పిల్లలకు ఇది అవసరం

మధ్యాహ్న భోజనం లేనందువల్ల హాజరు శాతం తగ్గుతోంది. కొంతమంది మధ్యాహ్న భోజనంకోసం ఇళ్లకు వెళ్లినవారు తిరిగి కళాశాలలకు రావడంలేదు. అలాగే డ్రాపౌట్స్ కూడా పెరుగుతున్నారు. మధ్యాహ్న భోజనం అమలుచేస్తే ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయి.

- రవి, జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మా ఆకలి తీర్చండి



ఉదయం కళాశాలకు వచ్చినప్పటినుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు భోజనం లేకుండా ఆకలితో ఉండాల్సి వస్తోంది. దీంతో చదవుపై దృష్టి సారించలేకపోతున్నాం. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే పేద, గ్రామీణ విద్యార్థులకు ఎంతో మేలు చేసినవారవుతారు.

- ఏఎస్ మోహన్‌కుమార్, ఎంపీసీ ద్వితీయ, పుత్తూరు

చాలామంది బాక్సులు తెచ్చుకోలేరు

చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థుల్లో చాలామంది లంచ్ బాక్సులు తెచ్చుకునే పరిస్థితి లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏమీ తినకుండా ఉండాలంటే కష్టంగా ఉంటోంది. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే చాలా బాగుంటుంది.

- వినయ్‌కుమార్, సీఈసీ ద్వితీయ, చంద్రగిరి



ఒకరోజు తింటే.. మరో రోజు పస్తు

ప్రతి రోజూ ఇంటి నుంచి భోజనం తెచ్చుకోలేం.దీంతో మధ్యాహ్నం ఒకరోజు తింటున్నాం.. మరో రోజు పస్తు ఉంటున్నాం. డబ్బులు ఉంటే హోటళ్లలో తినేది, లేదంటే మానుకునేది. ఆకలేసినా మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు ఉండక తప్పదుకదా.



- ఎం. సూర్యాచారి, ఐసీఎస్ఈ ఒకేషనల్, చంద్రగిరి

ముదరంపల్లె సర్పంచి చెక్‌పవర్ రద్దు

పెద్దపంజాణి, ఆగస్టు 1: పెద్దపంజాణి మండలం ముదరంపల్లె సర్పంచి చెక్ పవర్‌ను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2017-18లో ముదరంపల్లెలో అదే గ్రామానికి చెందిన వేమారెడ్డి అంగన్వాడీ భవనం నిర్మించారు. ఈ భవనానికి ఉపాధి హామీ నుంచి రూ.1,74,789 మంజూరు చేసి సర్పంచ్ ఖాతాలో జమయ్యాయి. ఈ నిధులను సర్పంచ్ విత్‌డ్రా చేసి వేమారెడ్డికి ఇవ్వలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. నిజానిజాలను విచారించిన న్యాయస్థానం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులను వేమారెడ్డికి ఇవ్వాలని ఆదేశించినా, సర్పంచ్ ఖాతరు చేయలేదు. నోటీసును సైతం పోస్టులో తీసుకోకపోవడంతో చెక్ పవరు రద్దు చేశారు.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కుప్పంలో 19.0మి.మీ, బైరెడ్డిపల్లి 16.4, శాంతిపురం 9.6, గుడుపల్లి 6.8, నగరి 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూలై సాధారణ వర్షపాతం 103.9 మి.మీ కురవాల్సి ఉండగా, 13.6 శాతం లోటుతో 89.8 మి.మీ మాత్రమే కురిసింది.

టమోటా ధరల పతనం



పలమనేరు, ఆగస్టు 1: పలమనేరు మార్కెట్ యార్డులో వారం రోజులుగా టమోటా ధరలు పతనమవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా నెల రోజుల క్రితం రూ.800 ధరపలికిన 15కిలోల టమోటా బాక్సు.. గురువారం రూ.420కి పడిపోయింది. గత వారం రోజులుగా ఇవే ధరలు ఉన్నట్లు రైతులు తెలిపారు. పెరిగిన వ్యవసాయ ఖర్చుల కారణంగా ఒక ఎకరా టమోటా సాగు చేయాలంటే రూ.4లక్షలనుంచి 5లక్షల వరకు వ్యయమవుతోందని రైతులు అంటున్నారు. కనీసం కిలో రూ.35నుంచి రూ.40 వరకు ధర లేకుంటే తాము నష్టపోవాల్సి వస్తోందన్నారు. అనంతపురం జిల్లాలో విస్తారంగా టమోటా సాగుచేయడంతో అక్కడి రైతులు కూడా ఇక్కడి మార్కెట్లకు టమోటాలను తరలిస్తున్నారని, అంతేకాక టమోటా అధికంగా వినియోగించే చెన్నై, విజయవాడ, తిరుపతి, నెల్లూరు పట్టణాలకు కూడా టమోటాలు పొరుగు జిల్లాల నుంచి వస్తున్నందున ధరలు క్రమేపి పడిపోతున్నాయని వ్యాపారులు అంటున్నారు. చెన్నై పరిసర ప్రాంతాల నుంచీ టమోటా సాగు చేసే రైతులు చెన్నై మార్కెట్‌కు తీసుకు రావడం కూడా ధరల పతనానికి కారణమని తెలిసింది. ప్రభుత్వం టమోటా ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మా పంచాయతీని మాకు ఇప్పించండి

- ఎమ్మెల్యేని కోరిన చార్వాగానిపల్లి గ్రామస్తులు

పెనుమూరు, ఆగస్టు 1: 'గత ప్రభుత్వ హయాంలో తమ పంచాయతీని తమకు తెలియకుండా పెనుమూరులో కలిపారు. అప్పటి నుంచి మాకు ఏ పనులు జరగడంలేదు. ఇంటి బిల్లులు రావడంలేదు. ఉపాధి కూలి పని కూడా లేదంటున్నారు. కాస్త మా పంచాయతీని తిరిగి మాకు ఇప్పించండి సారూ' అంటూ పెనుమూరు మండలం చార్వాగానిపల్లి పంచాయతీ వాసులు ఎమ్మెల్యే థామస్‌కు మొరపెట్టుకున్నారు. గురువారం ఆయన మండలంలోని చార్వాగానిపల్లి సచివాలయంలో పింఛన్ల పంపిణీకి హాజరవగా.. ఈ సమస్యను స్థానికులు ప్రస్తావించారు. ఎంపీడీవోను పిలిచి చార్వాగానిపల్లి రిజల్యూషన్ ఇచ్చి తిరిగి పంచాయతీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను ఆయన పంపిణీ చేశారు.

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపుపై కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: ఎన్నికల దృష్ట్యా ఆరునెలల పాటు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్ళిన 31 మంది తహసీల్దార్లు జిల్లాకు తిరిగివచ్చారు. కలెక్టరేట్‌లో గత నాలుగు రోజులుగా రిపోర్టు చేస్తున్నారు. వీరిలో రిటైర్డ్ కానున్న వారు తప్ప మిగిలిన వారికి కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాలకు కేటాయిస్తారు. దీనిపై కలెక్టరేట్‌లో కసరత్తు జరుగుతోంది. కాగా, తమకు అనుకూలంగా అధికార పార్టీ నాయకులు తహసీల్దార్లను నియమించుకుంటూ ఉంటారు. అయితే కూటమి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలతో అనుకూల అధికారుల విషయంలో కొంతవరకు సమస్యగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన నియోజకవర్గంలో పోస్టింగ్స్ ఇవ్వడం కుదరదని చెప్పింది. ఇక సొంత రెవిన్యూ డివిజన్‌లో కూడా పోస్టింగ్స్ ఇవ్వరాదని నిబంధన పెట్టింది. దీంతో ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా తహసీల్దార్లను అధికార పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరిన వారిని జిల్లా యంత్రాంగం నియమిస్తోంది. అన్ని నియోజకవర్గాల నుంచి మండలాలవారీగా ప్రతిపాదనలు, తిరస్కరణల జాబితా కలెక్టరేట్‌కు చేరింది. గురువారం ఉదయం నుంచి రాత్రివరకు కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, తిరుపతి జిల్లా పెంచలకిషోర్, డ్వామా పీడీ రాజశేఖర్‌లతో కలిసి పోస్టింగ్స్ ఇచ్చే జాబితా తయారీపై కసరత్తులు సాగిస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి దుర్మరణం



ట్రాక్టరు కింద పద్మనాభరెడ్డి మృతదేహం

పెనుమూరు, ఆగస్టు 1: ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందిన ఘటన పెనుమూరు మండలం సీఆర్‌కండ్రిగ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సీఆర్‌కండ్రిగకు చెందిన చిన్నమరెడ్డి కుమారుడు పద్మనాభరెడ్డి(47) గురువారం పొలంలో ట్రాక్టరుతో దుక్కిదున్ని తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో ట్రాక్టరు అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తాపడింది. ట్రాక్టర్ తిరగబడటంతో.. ఆ ట్రాక్టర్ కింద పద్మనాభరెడ్డి చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టీడీపీ కార్యకర్తనని డెయిరీల్లో పాలు తీసుకోవడంలేదు

దారి, మురుగునీరు వెళ్లకుండా చేస్తున్న వైసీపీ నేతలు ● ప్రాణహాని ఉందంటూ బాధితుల ఆవేదన



చిన్నరెడ్డెప్ప, మంగమ్మ

పుంగనూరు, ఆగస్టు 1: 'తెలుగుదేశం పార్టీ కార్యకర్తనని తమ గ్రామంలో డెయిరీలకు పాలు తీసుకోవడం లేదు. ఇంటికి దారి, మురుగునీటి సమస్యలతో వైసీపీ నేతలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు' అంటూ పుంగనూరు మండలం బండ్లపల్లెకు చెందిన బి.చిన్నరెడ్డెప్ప గురువారం వాపోయారు. వివరాలిలా ఉన్నాయి. బండ్లపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప 35 ఏళ్లుగా టీడీపీ కార్యకర్తగా ఉన్నారు. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పర్యటన సందర్భంగా పుంగనూరులో జరిగిన గొడవల కేసులో పోలీసులు అరెస్టు చేసి జిల్లా జైలులో 74 రోజులు రిమాండ్‌లో ఉంచారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పుంగనూరు టీడీపీ నేతలు బండ్లపల్లెకు వెళ్లారు. దీంతో చిన్నరెడ్డెప్ప తమ ఆవుల ద్వారా వచ్చే 12 లీటర్ల పాలను డెయిరీకి పోయడానికి తీసుకెళ్లగా ఏజెంట్ తీసుకోలేదు. సర్పంచ్ సునీత, వైసీపీ నాయకులు గురివిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి ఇబ్బందులు పెట్టారు. గ్రామానికి ఐదు పాల డెయిరీలు తరపున పాలు సేకరిస్తున్నా వైసీపీ నేతల బెదిరింపుల వల్ల ఎవరూ తమ పాలు తీసుకోలేదని ఆయన వాపోయారు. 'ఐదు కిలోమీటర్ల దూరం నడచి పుంగనూరుకు వెళ్లి పాలు అమ్ముకున్నాను. నేను ఒక్కడినే పుంగనూరుకు పాలు తీసుకెళ్లలేక కొత్తకోట, అంకుతోటపల్లెలో డెయిరీలకు పాలు పోశాను. మా ఇంటి నుంచి వర్షం, వ్యర్థపు మురుగు నీరు వెళ్లకుండా వైసీపీ నేత శ్రీనివాసులురెడ్డి గ్రామకంఠం స్థలంలో మట్టి తోలారు. మరో వైపు దారి లేకుండా రేకులతో ఆవుల షెడ్డు నిర్మించారు. గ్రామంలో వైసీపీ శ్రేణులు అత్యధికంగా ఉండటంతో మాతో ఎవరూ మాట్లాడకుండా ఆంక్షలు విధించి బెదిరించారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రం వద్ద నన్ను వైసీపీ నేతలు కొట్టారు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వైసీపీ వారు తమను చంపేస్తారని భయంతో ఇద్దరు ఆడపిల్లలు బెంగళూరులో చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్నట్లు చిన్నరెడ్డెప్ప భార్య మంగమ్మ తెలిపారు. తమకు ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని గత నెల 25వ తేది పుంగనూరు సీఐ జయరామయ్య, తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదన్నారు. కాగా కొద్దిరోజులుగా ఓ ప్రైవేటు డెయిరీ తనకు ప్రస్తుతం వస్తున్న 6లీటర్ల పాలు కోసం క్యాన్ ఇచ్చారని చెప్పారు. ఈవిషయంపై గురువారం పుంగనూరు సీఐ జయరామయ్య గ్రామానికి వెళ్లి విచారించారు. తమకు దారి, మురుగునీటి సమస్య తీర్చాలని బాధితులు కోరగా, రేకుల షెడ్డు స్థలానికి తమ వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయని, చిన్నరెడ్డెప్ప ఇంటికి వెళ్లేందుకు దారి ఉందని, ఎవరూ వారిని భయపెట్టలేదని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆయన కోరారు.

నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలను రూపొందించండి



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి, డీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. టెన్త్,ఇంటర్,డిగ్రీ, డిప్లమా, ఇంజినీరింగ్ కోర్సులు చేసిన నిరుద్యోగులను గుర్తించి, వారికి అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్, డీఆర్డీఏ పీడీ తులసి, డీఐసీ జీఎం చంద్రశేఖర్, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్, జిల్లా అధికారి గుణశేఖర్, ఎల్డీఎం హరీష్ పాల్గొన్నారు.

అక్టోబరు 30లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద చేపట్టిన 22,125 ఇళ్ల నిర్మాణాలను అక్టోబరు 30వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి పురోగతి దిశగా తీసుకురావాలని చెప్పారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తల్లిపాల వారోత్సవాలను గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే లాభాలను ఆరోగ్యశాఖ కార్యకర్తలు గ్రామాల్లో వివరించాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో తల్లిపాల వారోత్సవాలను డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి ప్రారంభించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారిణి నాగశైలజ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదుకు పోలీసుల మీనమేషాలు

- సీఎంను కలిసిన క్వారీ యజమాని

పలమనేరు, ఆగస్టు 1: పలమనేరు మాజీ ఎమ్మెల్యేపై తాను ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోక పోవడంతో ముఖ్యమంత్రిని కలిసి చెప్పానని క్వారీ యజమాని జనార్దననాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడ పలమనేరు మండలం మాదిగబండ వద్ద ఉన్న తన క్వారీని లీజుకు తీసుకొన్నారని జనార్దన నాయుడు తెలిపారు. తనతో చేసుకొన్న ఒప్పందం మేరకు లీజు డబ్బులుచెల్లించక పోగా, చెల్లని చెక్కులు ఇచ్చారన్నారు. దీనిపై తాను కేజీఎఫ్ కోర్టులో కేసుకూడా వేశానన్నారు. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోవడం.. వెంకటేగౌడ ఓటమి చెందటంతో తాను తన క్వారీని స్వాధీనం చేసుకొనేందుకు నిర్ణయించుకొన్నానని చెప్పారు. ఈ విషయం పసిగట్టిన వెంకటేగౌడ తన వాహనాలను అక్రమంగా తరలించుకుపోయాడని ఆరోపించారు. దీనిపై తాను జూన్ 8వ తేది పలమనేరు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా వెంకటేగౌడపై ఫిర్యాదు చేశానన్నారు. వైసీపీకి విధేయులుగా ఉన్న ఇక్కడి పోలీసు అధికారులు ఇప్పటికీ తన ఫిర్యాదుపై కేసు నమోదు చేయలేదన్నారు. తనను రెండుసార్లు స్టేషన్‌కు పిలిపించి బుజ్జగింపు మాటలు మాట్లాడి పంపేశారన్నారు. దీంతో ఈవిషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి ఫిర్యాదు చేశానన్నారు. తనకు న్యాయం చేస్తానని హామీ ఆయన ఇవ్వడంతో పాటు ఈవిషయమై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారని తెలిపారు.

మెడికల్ షాపులోనే వైద్యం

సెలైన్ బాటిల్ పోతుండగానే వృద్ధుడి మృతి ● డీఎంహెచ్‌వో తనిఖీ చేసిన రెండో రోజే ఘటన



మెడికల్‌షాపులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న దుర్గాదేవి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 1: గంగాధరనెల్లూరులోని ఎస్వీ మెడికల్స్ అనే మందుల షాపులో అనుమతులు లేకుండా రోగులకు వైద్యం చేస్తున్నారని రెండు రోజులకు ముందు డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ హెచ్చరికలను ఏ మాత్రం లెక్క చేయని నిర్వాహకులు.. మళ్లీ వైద్యం మొదలు పెట్టారు. అలా గురువారం వేల్కూరు పీపీ అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్ముగంరెడ్డి(60)కి మెడికల్ షాపులోనే వైద్యులు సూదిమందు వేసి సెలైన్ బాటిల్ పెట్టారు. సెలైన్ పోతుండగా ఆ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో వైద్యాధికారులు డాక్టర్ దుర్గాదేవి, ప్రవీణ్‌కుమార్ అక్కడకు వెళ్లారు. అనుమతులులేని మందుల షాపులో వైద్యం చేస్తూ ఒక వ్యక్తి మరణానికి కారణంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వెంటనే ఆ క్లినిక్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసి మూయించేశారు. సదరు మెడికల్‌షాపు యజమాని మృతుడి బంధువులకు నచ్చచెప్పి మృతదేహాన్ని తరలించారు. దీనిపై ఎవరూ కేసు పెట్టకపోవడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 1: జిల్లా బాలల పరిరక్షణ విభాగం, శిశు విహార్‌లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ నాగశైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషియల్ వర్కర్(మహిళ), అకౌంటెంట్, డేటా అనలిస్ట్ అవుట్ రీచ్ వర్కర్, పార్టు టైమ్ డాక్టర్ పోస్టుల్లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రెండు ఆయా పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. వన్‌స్టాప్ సఖి కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, లాయర్, పర్సనల్ పేరా మెడికల్, సోషియల్ కౌన్సిలర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల్లో ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రెండు మల్టీ పర్పస్ స్టాఫ్ పోస్టులకు, రెండు సెక్యూరిటీ గార్డు(మహిళ)లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పోషణ అభియాన్ పథకం కింద జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ, ప్రాజెక్టు కార్యాలయాల్లో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పీడీ తెలిపారు. డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ 01(జనరల్), డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు అసిస్టెంట్ 01(జనరల్), బ్లాక్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లుగా 01(బంగారుపాళ్యం-ఎస్సీ), పలమనేరు(ఓసీ)01, బైరెడ్డిపల్లె(బీసీ-ఎ) 01, శాంతిపురం01(ఓసీ), కుప్పం 01(ఎస్టీ), పుంగనూరు(ఓసీ)01 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 3 నుంచి 10వ తేదీలోపు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కార్యాలయం, రెండవ అంతస్తు, కలెక్టరేట్, చిత్తూరు అనే చిరునామాకు దరఖాస్తులను అందించాలని కోరారు. దరఖాస్తులు http\\chittoor.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో పొందాలని కోరారు.

పలువురు సీఐల బదిలీ

చిత్తూరు, జూలై 1: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారంతా రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. డీటీసీలో ఉన్న శ్రీనివాసరావును చిత్తూరు ఈస్ట్ సర్కిల్‌కు, ఈస్ట్ సర్కిల్‌లో ఉన్న కుళ్లాయప్పను వీఆర్‌కు, కల్లూరు సీఐ కట్టి శ్రీనివాసులును వీఆర్‌కు, డీసీఆర్‌బీలో ఉన్న జయరామయ్యను చిత్తూరు వన్‌టౌన్‌కు, వన్‌టౌన్‌లో ఉన్న విశ్వనాథరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు.

తుపాకీతో గాయపరచిన వ్యక్తికి మూడేళ్ల జైలు



కోర్టు వద్ద గోవిందస్వామి

చిత్తూరు లీగల్, ఆగస్టు1: తుపాకీతో ముగ్గురిని గాయపరచిన వ్యక్తికి చిత్తూరు న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. బంగారుపాళ్యం మండలం సీజేఎఫ్ఎస్ కాలనీకి చెందిన గోవిందస్వామి 2020 అక్టోబర్ 4వ తేదీన తన కొడుకు, కోడలు, అల్లుడితో గొడవపడి వారిని తుపాకీతో కాల్చాడు. ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గోవిందస్వామిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం ఏఎస్‌జే కోర్టులో వాయిదా ఉండగా పూర్వాపరాలు పరిశీలించిన పిదప నేరం రుజువు కావడంతో అతనికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెన్నెల తీర్పు చెప్పారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


మదనపల్లెలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


వాల్మీకిపురంలో పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె అర్బన్: ఆగస్టు 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రూ.4 వేలకు ఒకటో తారీఖునే ఇంటివద్దకే వెళ్లి అందజేస్తున్నార ని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఉద యం నుంచే రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బం దితో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్రమం తప్ప కుండా ఇంటి వద్దకే పెన్షన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి నారాచంద్రబాబు నాయుడు సారథ్యంలో పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత దక్కిందన్నారు. ఇందులో తట్టివారిపల్లె గ్రామం, బాలాజీ కాలనీ, ముజీబ్ కాలనీ, రామారావుకాలనీ, కృష్ణానగర్, ఎన్జీఓ కాలనీ, బర్మా వీధి, బసినికొండ ప్రాంతాల్లో వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, వికలాంగులకు రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో డీపీవో ధనలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు నాదేళ్ల విద్యాసాగర్, షంషీర్, జేసీబీ వేణు, నవీన్, మధు సూదన్‌రెడ్డి, రెడ్డిబూ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రన్న ధ్యేయం

రామసముద్రం, ఆగస్టు 1: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం చెంబకూరు, కాప్పల్లె, పెద్దకుర్పల్లె, రామసముద్రం పంచాయతీలలో జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రభుత్వ అధికారులతో రివ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పేదలకు ఇళ్లు, కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు, నిరుద్యోగులకు భృతి తదితర సంక్షేమ పథకాలు అమలు జరగనున్నాయని ఇందుకు సంబంధించి అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి ఫైళ్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బుక్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా కళాశాలలో తరగతి గ దులు, ప్రహరీ గోడ నిర్మించాలని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేను కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మదనపల్లె టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు విద్యాసాగర్, టీడీపీ సీనియర్ నాయకుడు రాటకొండ మధుబాబు, కొండూరు నారాయణరెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, కృష్ణంరాజు, చిన్నూస్వామి, స్థానికం రాజేష్, మాజీ జడ్పీటీసీ శివశంకర్, బోయ రమణప్ప, శివారెడ్డి, పెద్దిరెడ్డి, రెడ్డిశేఖర్, వేణుగోపాల్, కృష్ణప్ప, శ్రీనివాసులు, చంద్రప్ప అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరులో: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల సొమ్మును పెంచడమే కాకుండా ప్రతి నెలా 1వ తేదీనే ఇళ్ల వద్దకు చేరుస్తున్నారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణంలోని లక్ష్మీపురం, మోడల్ కాలనీల్లో లబ్ధిదారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ గత ప్రభుత్వానికి కేవలం రూ.వేయి పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పేద ప్రజల జీవితాలకు భరోసా కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు పింఛన్ల మొత్తాన్ని భారీగా పెంచారని తెలిపారు.

వాల్మీకిపురంలో: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వాల్మీకిపురం, గంబోయనపల్లె, చింతపర్తి తదితర గ్రామాలలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ పింఛను కానుక నగదును పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గ జమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, అంతటి అవినీతి పనులను తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. అనంతరం వాల్మీకిపురం తోట వీధికి చెందిన కార్యకర్త బొక్కసం ఆనంద ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయమై అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, జనసేన పీలేరు ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, నాయకులు కృష్ణారెడ్డి, పులి సత్తారెడ్డి, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, కోసూరి రమేష్, మురళి, బొక్కసం రామకృష్ణ, కువైట్ సయ్యద్‌బాషా, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పింఛన్లు పెంచడంతో అవ్వాతాతలు, దివ్యాంగుల కళ్ళలో ఆనందం కన్పిస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మద్దినాయనిపల్లెలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారన్నారు. అవ్వాతాతలకు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందజేస్తున్నా మన్నారు. మండలంలో గురువారం 97.27 శాతం ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పోలప్ప తెలిపారు. తొలి రోజు రికార్డు స్థాయిలో పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. మండలంలో మొత్తం 6729కి గానూ 6545 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, ఆర్ఐ వీరాంజనేయులు, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికా ర్జునానాయుడు, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, నాయకులు మస్తాన్‌రెడ్డి, కేశవరెడ్డి, రమణారెడ్డి, సురేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ప్రభుత్వ పథకాలు అర్హులందరికి అందాలని తంబళ్లపల్లి నియోజక వర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సిద్ధవరం, శివపురం గ్రామాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్‌లు పంపిణీ చేశారు. తంబళ్లపల్లి టీడీపీ పరిశీలకులు సీడ్ మల్లికార్జున నాయుడు, ఎంపీటీసీ రుక్మాంగధరెడ్డి మాజీ ఎంపీపీ రజనీదత్, కూటమి నేతలు సిద్దవరం ప్రసాద్, విశ్వనాధరెడ్డి, గంగాధర, కుం టకిందపల్లి చంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర, ఇస్మాయిల్(చింటు) రామాంజులునాయుడు, నార శ్రీనివాసులు, సయ్యద్‌షావలి, తుమ్మల మహేశ్వర, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

శభాష్ ఎంపీడీవో: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్‌ల పంపిణీలో భాగంగా పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణ్య గురువారం తెల్లవారు జామున 5 గంటలకే పెద్దమండ్యంలో పింఛన్‌ల పంపిణీ ప్రారంభించి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. పెద్ద మండ్యం, వడ్డిపల్లి గ్రామాలలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి జగన్, సచివాలయ సిబ్బంది మంజునాధ, సుగుణమ్మ పాల్గొన్నారు.

గుర్రంకొండలో: మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది 97 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నాగశివారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో వివిధ రకాల కింద మొత్తం 6105 పింఛన్లు ఉండగా 5983 మందికి గురువారం పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె, తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో 6,265 మంది పింఛనుదారులు ఉండగా గురువారం సాయంత్రానికి 6,120 మందికి 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో క్రిష్ణమూర్తి తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 5:30ల నుంచే స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబునాయుడుకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, సోము శేఖర్, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, యూనిట్ ఇన్‌చార్జి నారాయణ, తెలుగు యువత నరసింహులు, ఆనంద్ నాయుడు, నరేంద్రనాయుడు, ఎమ్మార్పీఎస్ జగదీష్, భాస్కర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కురబలకోటలో: సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలో ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మండలంలోని ప్రతి గ్రామంలో అధికారులు, టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పింఛన్‌లను ఇవ్వడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు అర్హులందరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, అయూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


కురబలకోటలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్


తంబళ్లపల్లెలో పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

సుప్రీంకోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో మదనపల్లెలో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కుమారపురంలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి పూలమాలు వేసి క్షీరాభిషేకం నిర్వహించారు. అక్కడ నుంచి బైక్ ర్యాలీ రామారావు కాలనీ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఎస్ నరేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నేత రవిలు మాట్లాడుతూ ప్రజా స్వామ్యం ఉద్యమాలకు ఊపిరి పోసిందన్నారు. 30 ఏళ్లుగా ఉద్యమాలకు, పోరాటాలకు అండగా నిలిచిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో నాయకులు మనోహర్, ప్రసాద్‌బాబు, ఆర్డీఎస్ రమణ, రెడ్డినారాయణ, బండ్రేవు రమణ, శ్రీరాములు, వేణు, మధు, సుబ్బు, నాగ, అంజీ, నరసింహులు మనోజ్, పవన్, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నాంది పలికిన సీఎం చంద్రబాబు


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మయాన్‌బాషా

ములకలచెరువు, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాష్ట్రాలు చేయవచ్చని సుప్రీంకోర్టు కీలక తీర్పు ఆనందదాయకమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002 నుంచి 2004 వరకు ఎస్సీ వర్గీకరణను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేశారని ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.మయాన్‌బాషా పేర్కొన్నారు. ములకలచెరువులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఐదేళ్లలో గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎస్సీ, ఎస్టీలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డెప్ప, ముత్యాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


తంబళ్లపల్లెలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

తంబళ్లపల్లెలో: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ తంబళ్లపల్లెలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. గురువారం స్థానిక హరిత కూడలి వద్ద టీడీపీ నాయకులతో కలసి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ..ఏపీ నాటి సీఎంగా చంద్రబాబు నాయుడు 2000 నుంచి 2004 వరకు ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణను అమలుచేశారని మళ్లీ నేడు చంద్రబాబు సీఎంగా వర్గీకరణ తీర్పు వచ్చిందని వారన్నారు. ప్రధాని మోదీ సైతం అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమని ఎన్ని కల ముందు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు మల్లికార్జున, వెంక టప్ప బొజ్జప్ప, మారప్ప, జగదీష్, భాస్కర్, టీడీపీ మండలాధ్య క్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర, చలపతినాయుడు పాల్గొన్నారు.

వీఆర్వోను సస్పెండ్‌కు ఆదేశించిన ఎమ్మెల్యే

నిమ్మనపల్లి, ఆగస్టు 1: మండలంలోని రాచవేటివారిపల్లి వీఆర్వో రామకృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. గురువారం వృద్ధాప్య పింఛన్‌లు పంపిణీ చేసేందుకు టీడీపీ నాయకులతో రాచవేటివారిపల్లికి విచ్చేసి ఆయన పింఛన్‌ను పంపిణీ చేస్తుండగా రెవెన్యూ సిబ్బంది కనిపించలేదు. దీంతో తహసీల్దార్, ఆర్ఐలు ఉన్నారా? అని అడగగా వారుకూడా ఈ కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే సంబంధిత వీఆర్వో రామకృష్ణ సస్పెండ్ చేయాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, బీసీ అధ్యక్షుడు లక్ష్మన్న, చెంగ్రాయుడు, శంకర పాల్గొన్నారు.

చెత్త తయారీ కేంద్రాల నిర్వహణ ఇదేనా..?

నిమ్మనపల్లి, ఆగస్టు 1: మండలంలోని చెత్త తయారీ కేంద్రాల నిర్వహణ ఇదేనా..? అని మండల అధికా రులపై జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి ఆగ్ర హం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పలు పంచాయతీల్లో ఉండే ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ అన్ని పంచాయతీల్లోనూ చెత్త సంపద కేం ద్రాల నిర్వహణ అధ్వాన్నంగా ఉన్నాయని వాటిని ని త్యం పర్యవేక్షించి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. నిమ్మ నపల్లిలో ఉన్న చెత్త సంపద కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డ్రైనేజీ కాలువల ను పరిశీలించి పారిశుధ్యంపై తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చలపతిరావు కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలకు తావులేని సుపరిపాలన అందిద్దాం

పీలేరు, ఆగస్టు 1: అవినీతి రహిత పరిపాలన అందివ్వడం మన బాధ్యత అని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే హోదాలో గురువారం తొలిసారిగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు గ్రామ పంచాయతీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీలో జరిగిన అవినీతిపై ఘాటు విమర్శలు చేశారు. గతంలో ఎమ్మెల్యే ఉన్న వ్యక్తి కారుకు పీలేరు పంచాయతీ నిధులతో డీజిల్ పట్టించారని తెలిసి ఆశ్చర్యమేసిందని అన్నారు. అంతే కాకుండా గత పాలకుల వ్యక్తిగత అభిరుచుల మేరకు పంచాయతీ కార్యాలయంలో ఆవులు మేపడం, వాటి సంరక్షణకు ప్రతి నెలా రూ.40 వేలు వెచ్చించడం ఏమిటని ప్రశ్నించారు.గత ఐదేళ్లలో పీలేరు పంచాయతీలో సుమారు రూ.3 కోట్ల మేర అవినీతి జరిగినట్లు తన వద్ద సమాచారం ఉందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక విచారణ బృందం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపామని, నివేదిక రాగానే అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భూ ఆక్రమణలు, అవినీతి చేస్తే సహించేది లేదు

అధికారంలో ఉన్నామన్న భావనతో టీడీపీ శ్రేణులు ఎక్కడైనా భూఆక్రమణలు, అవినీతికి పాల్పడితే సహించబోనని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని పార్టీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. కాగా పీలేరులోని 100 పడకల ఆసుపత్రి అభివృద్ధికి అన్ని చర్యలూ తీసు కుంటానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు, ఈవో గురుమోహన్, సర్పంచ్ జీనత్ షఫీ, వైద్యులు ఈశ్వర్ సురేంద్ర, భారతి, జనసేన్ ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, టీడీపీ నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, లడ్డూ జాఫర్, మల్లెల రెడ్డిబాషా, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు1: చేనేత కార్మికుడిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన నీరుగట్టువారిపల్లెలో చోటు చేసుకుంది. కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీకి చెందిన నాగేంద్ర (46) నీరుగట్టువారిపల్లెకు చెందిన రాజారెడ్డి యజమాని వద్ద మగ్గం పనికి వస్తానని చెప్పి అడ్వాన్సు తీసుకున్నాడు. కాగా అతను మరో చోట మగ్గం నేస్తున్నాడు ఆ విషయం గమనించిన రాజా రెడ్డి రింగ్‌రోడ్డులో ఉన్న నాగేంద్రను పట్టుకుని ఇంట్లో బంధించి రాజారెడ్డి భార్య శ్యామల, కుమారుడు కార్తీక్ కొట్టి గాయపర్చినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన బాధితుడు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లారు. కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ హరిహరిప్రసాద్ తెలిపారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక


శ్రీనివాసులు వంశీధర్ రమేష్ ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, ఆగస్టు 1: ఏపీయూడబ్ల్యూజే అన్నమయ్య జిల్లా కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ప్రీతమ్ రెసిడెన్సీలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రథమ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సమప్రాధాన్యం కల్పిస్తూ.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి. రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సాయంకాలం ఎడిటర్ వెంకటరెడ్డిల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ప్రింట్‌మీడియా జిల్లా అధ్యక్షుడిగా గౌనిపల్లె శ్రీనివాసులు (ఆంధ్రజ్యోతి), ప్రధానకార్యదర్శిగా వంశీధర్ (సాక్షి), కోశాధికారిగా రామచంద్ర(విశాలాంధ్ర) గౌరవసలహాదారులు రెడ్డెయ్యరాజు, గౌరవాధ్యక్షుడిగా జీవీ క్రిష్ణయ్య (ఆంధ్రప్రభ)లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, సహాయకార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులను అన్ని నియోజకవర్గాల నుంచి సమానంగా ఎన్నుకున్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి హాజరైన పాత్రికేయులు సూచించిన వాళ్లనే కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులుగా ఎస్. రమేష్‌కుమార్‌రాజు (ఐన్యూస్), ప్రధానకార్యదర్శిగా సి. ఈశ్వర్ (99టీవీ) కోశాధికారిగా శ్రీధర్‌బాబు (స్వతంత్ర)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పల్లం తాత య్య (మహాన్యూస్), గౌరవసలహాదారులుగా కె.వెంకట్రామరాజు (10టీవీలను) ఎన్నుకున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

మైనార్టీలలో విద్యా చైతన్యం రావాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 1: మైనార్టీలలో విద్యా చైతన్యం రావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న ఉచిత టెట్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో టెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 45 రోజులు పాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇస్తున్నామన్నారు. పలువురు టెట్ అభ్యర్థులు శిక్షణకు బయట ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎమ్మెల్యే సొంత ఖర్చులతో వసతి, భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణా కేంద్రంలో 100 మందికే అవకాశం ఉండగా మదనపల్లె సెంటర్‌కు 150 మంది దరఖాస్తు చేసుకున్నారని, మిగిలిన వారికి శిక్షణా అవకాశం కల్పించాలని రూటా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్, కోర్స్ డైరెక్టర్ ఎస్ షాజహాన్, ఉపాధ్యాయులు ఇస్మాయిల్ హుమయూన్ ఎమ్మెల్యేని కోరగా సంబంధింత శాఖమంత్రితో మాట్లాడి సీట్ల సంఖ్య పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం షాజహాన్, విద్యుత్ శాఖ డీఈ గంగాధర్, కౌన్సిలర్లు కరీముల్లా, రూటా అధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ ఖాన్, టీడీపీ మదనపల్లె పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి శివరాంప్రసాద్, నాయకులు షంషీర్, విద్యాసాగర్, అక్బర్‌ఖాన్, దాదు, ఏసీబీ వేణు, వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు పోదల పరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె టౌన్, ఆగస్టు 1: మదనపల్లె డివిజన్‌లో విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఓసీ అసోసియేషన్ నాయకులు ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గురువారం మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను ఓసీ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలకంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం, కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓసీ అసోసియేషన్ డివిజన్ నాయకులు శేషాద్రి నాగరాజు, రఘు, శ్రీనివాసులు, శ్రీపతి,శాస్త్రి, హరినాథ్‌రెడ్డి, శివమూర్తి, రవీంద్రరాజు, ఎర్రంరెడ్డి, రెడ్డిభాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 1: విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎంఈవో నాగసుబ్బరాయుడు సూచించారు. గురువారం ఎంఈవో కోటకొండ ఎంపీయూపీఎస్ పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికతో పాటు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం అందచేయాలని వంట నిర్వాహకులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా నాగశివారెడ్డి

గుర్రంకొండ, ఆగస్టు 1:గుర్రంకొండ ఇన్‌చార్జి ఎంపీడీవో నాగశివారెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి పదవీవిరమణ చేయడంతో కార్యాలయంలో పని చేసే ఏవో నాగశివారెడ్డిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

95 మందికి ఉచిత కంటి పరీక్షలు

వాల్మీకిపురం, ఆగస్టు 1: వాల్మీకిపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో 95మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. 20మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

రీ సర్వే సక్రమంగా లేదంటూ నిరసన


నిరసన తెలుపుతున్న కాశీరావుపేట రైతులు

మదనపల్లె అర్బన్, జూలై1:భూముల రీ సర్వే సక్రమంగా నిర్వహించలేదని మదనపల్లె మండలం, కాశీరావుపేట గ్రామానికి చెందిన రైతులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వహించిన రీ సర్వేలో తమ రికార్డుల ప్రకారం కాకుండా ఉన్న భూమిని తక్కువగా రీ సర్వేలో చూపించారని దీనిపై సర్వే నిర్వహించి తమ భూమిని తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాశీరావుపేట రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూ బాధితుల ఫిర్యాదులు

మదనపల్లె అర్బన్, ఆగష్టు1: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనానికి సంబంధించిన భూ కబ్జా కోరల్లో చిక్కుకున్న బాధితుల ఫిర్యాదులు ఇవ్వడానికి గురువారం కూడా రైతులు విచ్చేశారు. వారికి మద్దతుగా సీపీఐ నాయకులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా బాధితులు మీడియాతో మాట్లాడుతూ ఎగువ కోట మగ్బుల్‌సాహెబ్ కుమారుడు ఫయాజ్ బాషా పేరిట విద్యావంతుడైన డీఆర్ సుందరరాజ్ సంతకం లేకుండా నిరక్షరాసుడులా వేలిముద్రలతో పోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి వివాదం చేసున్నారని తెలిపారు. అలాగే మండలంలోని వలసపల్లె గ్రామం చెందిన ఎన్ నరసింహులు కుమారుడు దేవమణి తనకు సంబంధించిన సర్వే నెంబరుల్లో 516-1 2ఎకరాల 60 సెంట్లు, 516-2లో 3 ఎకరాల37 సెంట్లు 516లో 3 ఎకరాల 39 సెంట్లు ఉందని ,మా స్వాధీనంలో ఉన్న భూమిని కాజేయాలని వైసీపీ నాయకులు కుట్రపన్ని ఇబ్బందులు కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

కొలిక్కిరాని బొప్పాయి రైతుల నష్ట పరిహారం


ఆందోళన చేస్తున్న బొప్పాయి రైతులు

కలికిరి, ఆగస్టు 1: నష్ట పరిహారం కోసం నెల రోజులుగా బొప్పాయి రైతులు చేస్తున్న ఆందోళన ఒక కొలిక్కి రావడం లేదు. దీంతో నర్సరీ యజమానుల చేతిలో మోసపోయిన బొప్పాయి రైతులు గురువారం పెద్ద సంఖ్యలో స్థానిక పోలీసు స్టేషను చేరుకుని ఆందోళన చేపట్టారు. నర్సరీ యజమానుల నుంచి నష్ట పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు ఆర్. మోహన్‌ను రైతులు ఆశ్రయించారు. మదనపల్లె, కలికిరిలోని బొప్పాయి నర్సరీల నుంచి తెచ్చిన మొక్కలు సత్ఫలితాలివ్వకుండా ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాసిరకం నకిలీ మొక్కలను అంటగట్టి నర్సరీ యజమానులు మోసం చేశారని రైతులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం దక్కక పోవడంతో గురువారం రైతులు మూకుమ్మడిగా పోలీసు స్టేషనుకు వచ్చి యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లెకు చెందిన శేఖర్ రెడ్డి, కలికిరికి చెందిన యల్లా రెడ్డి నర్సరీల నుంచి ఈ ఏడాది రైతులు కొనుగోలు చేసిన నకిలీ బొప్పాయి మొక్కల కారణంగా పంట దిగుబడిలేక నష్టాల పాలయ్యామని పోలీసుల ముందు వాపోయారు. ఎకరాకు రూ2 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టినా పాతిక శాతం కూడా ఫలితం దక్కలేదని ఈ కారణంగా స్థానిక నర్సరీ యజమాని యల్లారెడ్డి నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని, లేదా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఎకరాకు రూ.20 వేలు చెల్లించేందుకు నర్సరీ యజమాని అంగీకరించినట్లు రైతులు తెలిపారు. అయితే రూ.40 వేలు ఇచ్చినా జరిగిన నష్టం భర్తీ కాదని రైతులు స్పష్టం చేశారు. రైతుల డిమాండు మేరకు కలికిరి నర్సరీ యజమానిని పోలీసులు స్టేషనకు రప్పించి రైతులతో చర్చించుకోవలని లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని చెపుతున్నారు. మదనపల్లె నర్సరీ యజమాని శేఖర్ రెడ్డిని కూడా హాజరు పర్చాలని రైతులు పోలీసులను కోరారు. శుక్రవారం చర్చలు కొలిక్కి రానట్లయితే నర్సరీ యజమానులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు కూడా చెపుతున్నారు. బొప్పాయి రైతులు సుధాకర్ రెడ్డి, రాఘవేంద్ర, వేణుగోపాల్, వెంకట్రమణా రెడ్డి, మదనమోహన్ రెడ్డి, శేఖర్ తదితరుల నేతృత్వంలో నర్సరీ యజమానులతో చర్చలు జరుపుతున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 1: తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలనీ సీడీపీవో సుజాత పేర్కొన్నారు. గురువారం మండలంలోని బసినికొండ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సీడీపీవో ప్రారంభించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ఒక గంట పాటు ముర్రుపాలు తాపించాలన్నారు. అలాగే స్థానిక సర్వజన బోధనాసత్రిలో తల్లిపాల వారోత్సవాలపై వైద్య ఆరోగ్య సిబ్బంది చేయాల్సిన విధులు, అవగాహనపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, పద్మాంజలిదేవి, ప్రసాదరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో అంగన్వాడీల ర్యాలీ

వాల్మీకిపురం, ఆగస్టు 1: స్థానిక ఐసీడీఎస్, సీడీపీవో భారతి, అంగన్వాడీ అధికారులు, వైద్య సిబ్బంది పట్టణ పురవీధులలో తల్లిపాల ప్రాముఖ్యతపై బ్యానర్లు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడలో: చంటి పిల్లలకు తల్లిపాలను పట్టించడం వలన వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముడియంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన తల్లులకు పిల్లల పెరుగుదలకు అవసరమైన పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాసీర్, జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్న తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకీ, బోయ సంఘం అధ్యక్షుడిగా మధు

తంబళ్లపల్లె, ఆగస్టు 1: ఏపీ వాల్మీకి, బోయ సంఘం తంబళ్లపల్లె మండలాధ్యక్షుడిగా పరుసతోపు పంచాయతీ బోయపల్లెకు చెందిన టి.మధు నియ మితులయ్యారు. ఈ మేరకు ఏపీవీ బీఎస్ రాష్ట్ర హైపవర్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..వాల్మీకి బోయల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేయడంతో పాటు వారి అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలి పారు.